# మీరజూలగులూ!

ప్రతి వ్యక్తికి ఈ భూమ్మీద కనీసం మరొక్క మనిషి మీద, అతడి మాట మీద గురి, గౌరవం నమ్మకం వుండితీరతాయ్. ఇంట్లో ఏదైనా ప్రాబ్లం వచ్చినపుడు భార్య ఇలా చేద్దాం అంటే వీల్లేదంటాడు. ఎవరైనా సరే ఎంతగా ఎన్నివిధాల లక్ష్య పెట్టనివాడు గురి పెంచుకున్న ఆ గురుడు చెప్పినదానికి నోరెత్తకుండా తలాడిస్తాడు. చూసేవాళ్లకి ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆ రహస్యం ఏమిటో అంతుబట్టదు . అక్కడున్న అందరూ దీనికి తలో వ్యాఖ్యానం చేస్తారు. మనకి నచ్చదు. నమ్మబుద్ధి కాదు. అంచేత వెళ్ళిపోయి మనకి గురున్న మరో గురుడితో దీన్ని గురించి చర్చిస్తాం. అతడేదో బాష్యం చెపుతాడు. అదేమిటో అది మనకి బాగా నప్పుతుంది. అంటే దీనర్థం – మన స్విచ్చి ఇక్కడున్నదన్నమాట.

సాధారణంగా మనలో చాలామందికి స్విచ్చి బోర్డులు ఇళ్ళల్లోనే వుంటాయి. అర్ధాంగులూ ఆపరేట్ చేస్తుంటారు. ఉదయం బయట కొచ్చిన దగ్గర్నించి తిరిగి ఇంటికి చేరేదాకా జరిగిన సంగతులన్నీ పూసగుచ్చినట్లు భార్యకి చెప్పేసి, ఎవరి విషయంలో ఎలా ప్రవర్తించాలో ఏం చెయ్యాలో సలహాలని పిల్చుకునే ఆజ్ఞల్ని స్వీకరిస్తారు. బయటికి మాత్రం అవన్నీ తమ నిర్ణయాలుగానే చెప్పుకుంటారు. అలాంటి ఇంటిగ్గాని వెళ్ళామంటే ఆ ఇల్లాలు మన గురించి అప్పటిదాకా అందిన రిపోర్టు నేపద్యంలో మనవంక అదోలా చూస్తుంది. మనవాడి సంగతి మనకి తెలీకపోవటం చే ఆ చూపుల భావం మనకి సమంగా అర్దం కాదు. పైగా కాఫీ కప్పు చేతికిస్తూ ఆవిడ ‘ మావారు చాలా అమాయకుడండి , తగని మొహమాటం. బయట విషయాలు నాకేం చెప్పరనుకోండి – అయినా ఆఫీసులో ఎవరో ఈయనచేత సిగరెట్లు , బ్రాందీలు తాగిస్తున్నారేమోనని అనుమానంగా వుంది ’ అనిగాని అంటే – మీకు మీరే ఒక్కసారి ఆత్మశోధన చేసుకోవాల్సి వుంటుంది. గుర్తు చేసుకుంటే ఆయన గారి చేత ఏ సిగరెట్టో తాగించిన సంఘటన మీ కళ్ళ ముందు సాక్షాత్కరిస్తుంది. ఇలాంటివాళ్ళు ఓ పట్టాన దేనికి కమిట్ కారు. సహాయం అడిగినా సలహా అడిగినా ఆలోచించి చెప్తానంటారు. మనకి కోపం రావటం సహజం – స్విచ్చి బోర్డు ఇంట్లో వుందన్న సంగతి తెలీకపోవటం చేత.

ఇహ, మరోరకం వాళ్ళు ఇళ్ళల్లో వాళ్ళ మాటని తేలిగ్గా కొట్టిపారేస్తారు. వాళ్ళేం చెప్పినా ససేమిరా వీల్లేదంటారు. కానీ ఆఫీసులో పక్క సీటు వెంకటరత్నమో, వాళ్ళవూరి సుబ్బరత్నమో చెప్తే సరేనంటూ తలాడిస్తారు. మొగుడిచేత ఏపని చేయించాలన్నా ఆ భార్య ఆ వెంకటరత్నానికో , సుబ్బరత్నానికో కబురు పెట్టి పిలిపించి బతిమాలుకోవాలి ' నా మాట అస్సలు వినరు, కాస్త మీరన్నా చెప్పి పుణ్యం కట్టుకోండి. అన్నయ్యాగారు ( అంటూ ఆ వెంకటరత్నం తెలివిగా ఏం తెలీనట్లు. నటించి , సమస్యని తానే అడిగి పరిష్కారం కూడా తనే చెప్పి చేయిస్తాడు. ఇలాంటి వాళ్ళతో నెగ్గుకురావడం భార్యలకి కష్టమే . ఇంకొంతమందికి ఈ గురి, గౌరవాలు క్షణికాలు , అశాశ్వితాలు . అంటే రోజురోజుకీ , వారానికి, నెలకో నమ్మకాలు గౌరవాలు మారిపోతుంటాయి. ఈరోజు సుబ్బారావంటే ప్రాణం – రేపు అదే సుబ్బిగాడంటే చిరాకు, కోపం ...ఇంట్లో ఆడమనిషి ఈ సంగతి గుర్తించక సుబ్బారావు చేత సిఫార్సు చేయిస్తే పని పాడవటం అటుంచి , డొంకంతా కదుల్తుంది. కొంతమందికి పెళ్ళయి పిల్లలు పుట్టుకొచ్చినా , ముసలి తల్లిదండ్రులు ఎంత చెబితే అంత. పితృవాక్య పరిపాలన అంటారే అదన్నమాట. మరికొంతమందికి, అత్తగారి మాటంటేనో, పెళ్ళికాని మరదలి సలహా అంటేనో శిరోధార్యం . అసలీ గురి, గౌరవాలు ఎలా ఏర్పడతాయో, దానికి కారణాలేమిటో తెల్సుకోగలిగితే మనిషి నైజాన్ని వంటపట్టించుకున్నంత ఫలం....

నా చిన్నతనంలో మా ఇంటి పక్కన ఓ ఫ్యామిలీ వుండేది. ఇద్దరికీ ఆధ్యాత్మిక చింతన అధికంగా ఉండేది. కానీ ఏ విషయంలోనూ సామరస్యం కుదిరేది కాదు. ప్రతి రోజూ గొడవలూ, పోట్లాటలు, సాయంత్రం అయ్యేసరికి ఇద్దరూ గుడికి హరికదా కాలక్షేపానికి వెళ్ళేవారు. భర్తగారికి హరికథ చెప్పే హరిదాసు గారి మాటంటే వేదవాక్కు. అంచేత భార్య కాస్త ముందుగా వెళ్ళి సమస్యని ఆయనకి విన్నవించుకునేది. దాసుగారు చెప్తున్న కథలోనే ఈవిడ సమస్యని. దానికి పరిష్కారాన్ని గూడా కలిపి కథారూపంలో చెప్పేవాడు ! ' అంచేత నాయన్లారా ! కృష్ణపరమాత్మ ఏం చెప్పాడంటే ఆవకాయిలు, మాగాయి వగైరా వూరగాయలు పెట్టుకుంటేనే తనకి ఆనందం అన్నాడు. డబ్బు ల్లేవనో, దుబారా అనో వూరగాయిలు మానేస్తే ఇల్లాలు బాధపడుతుంది. ఇంటి ఇల్లాలు నొచ్చుకుంటే లక్ష్మి అక్కడుండదు. లక్ష్మి లేకపోతే శ్రీమన్నారాయణలని దూరం చేసుకున్న ఆ ఇంటి యజమానికి మోక్షప్రాప్తి వుండదు. అంచేత వెంటనే అందరూ వూరగాయలు వేసుకోండి. వైకుంఠప్రాప్తిని పొందండి '. ఇలా వుండేది తంతు.

అంచేత – నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలకి పరిష్కారాలు ఎన్నుకునే విజ్ఞత మనకి లేనపుడు, ఇంట్లో వాళ్ళపైనే ఆధారపడటంనయం. మన స్విచ్చిని ఇంకోళ్ళ చేతికిస్తే ఫలితాలు ఎప్పుడూ ఆనందదాయకంగా వుండకపోవచ్చు మరి !

------- అయ్యిపోయింది -------